# 17.3 కిలోల గంజాయి స్వాధీనం

- తరలిస్తున్న వ్యక్తి అరెస్టు
- మరొకరు పరార్
- ఏసీపీ శ్రీనివాస్‌రావు వెల్లడి



గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18 : రైల్వే స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి 17.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వేస్టేషన్ నుంచి బ్యాగ్ తో వస్తున్న వ్యక్తిని ఆపి చెక్ చేయగా గంజాయి లభించింది. దీంతో ఒడిషా రాష్ట్రం, సనకుండి మండలంలోని సింగిపూర్ పార్ట్ గ్రామానికి చెందిన నిందితుడు శంకర్ బిస్వాల్ (25)ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా, ముంబైలో బిల్డింగ్ వర్క్ హెల్పర్‌గా పని చేసేవాడినని చెప్పాడు. కొంతకాలంగా అక్కడ పని దొరక్కపోవడంతో మరో వ్యక్తి ప్రభాకర్‌తో కలిసి గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలిసి ఒడిషా వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్త దగ్గర కిలో రూ.12వేల చొప్పున 17.3 కిలోల గంజాయి కొనుగోలు చేసి ముంబైలో కిలో రూ.20 వేల చొప్పున విక్రయించేందుకు రైల్లో బయల్దేరారు. ఈ క్రమంలో ట్రైన్‌లో పోలీసులు చెక్ చేస్తుండడంతో స్టేషన్ ఘన్‌పూర్ రైల్వే స్టేషన్‌లో దిగి బయటకు వస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా, గంజాయి లభించిందన్నారు. కాగా, ప్రభాకర్ తప్పించుకున్నాడని తెలిపారు. గంజాయి రవాణాదారులను పట్టుకున్న సీఐ సట్ల రాజు, ఎస్సై నాగరాజు, సిబ్బంది శ్రీనివాస్, అనిల్, యాకయ్య, నరేశ్, రాఘవేందర్, హోంగార్డు శ్రీను, ఏఎవో సల్మాన్ పాషాతో పాటు ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఎస్ కృష్ణను ఏసీపీ అభినందించారు.

## హత్యాయత్నం కేసులో భర్తకు ఆరేళ్ల జైలు

వరంగల్ లీగల్, అక్టోబర్ 18 : భార్యను హత్య చేయడానికి ప్రయత్నించిన భర్తకు ఆరు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం వెంకటేశ్వరరావు బుధవారం తీర్పు ఇచ్చారు. రూ.11వేల జరిమానా కూడా విధించారు. సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన పురం వెంకటేశ్వర్లు– జయ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. ఆస్తి పంపకాల విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఇద్దరు కూతుళ్ల వివాహం జరిగినా వీరి మధ్య సయోధ్య కుదరలేదు. తన భార్యను ఎలాగైనా అంతమొందించాలన్న ఎత్తుగడతో 2019 ఫిబ్రవరి 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటేశ్వర్లు తన భార్యపై కత్తితో దాడి చేశాడు. ఇంతలో చిన్న కూతురు నీరజ అక్కడికి వచ్చి కత్తితో తన తల్లిపై దాడి చేస్తున్న తండ్రిని చూసి అరవడంతో చుట్టుపక్కల వారు గుమిగూడారు. వెంటనే నిందితుడు పారిపోగా జయను స్థానికులు పోలీసుల సాయంతో దవాఖానలో చేర్పించారు. ఐదు రోజుల తర్వాత కోమా నుంచి బయటికి వచ్చిన బాధితురాలు, ఆమె కూతురు నీరజ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ కేసును అప్పటి సంగెం ఎస్సై ఎం నాగరాజు దర్యాప్తు చేశారు. కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ పీహెచ్. రాజు, లైజన్ ఆఫీసర్ ఎం వెంకటస్వామి, హోంగార్డు పీ కిషన్ సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్కే అబ్దుల్ నబీ బాధితురాలి తరపున వాదించారు.



హసన్‌పర్తి : స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ తుమ్మ గోపి

## రూ.1.37 కోట్ల నగదు పట్టివేత

రఘునాథపల్లి అక్టోబర్ 18 : మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద పోలీసులు బుధవారం రాత్రి రూ. 1.37కోట్లు పట్టుకున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, తొర్రూరు ఎస్‌బీఐ బ్యాంచ్‌ల నుంచి ఎమ్మెస్ వాహనం ఇన్‌చార్జి మురళీధర్ రెడ్డి ఈ డబ్బులను జనగామకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు డబ్బులను క్యూఆర్ కోడ్ సహకారంతో తరలించాలని, కానీ బ్యాంకు అధికారులు ఎలాంటి పత్రాలు, క్యూఆర్ కోడ్ లేకపోవడంతో సీజ్ చేశారు. అనంతరం ఎన్నికల కమిషన్ స్క్వాడ్‌కు ఈ వాహనాన్ని అప్పగించారని ఏసీపీ చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

### హసన్‌పర్తిలో రూ.8.21లక్షలు..

హసన్‌పర్తి : అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో బుధవారం హసన్‌పర్తి, అంబాల క్రాస్ వద్ద హసన్‌పర్తి, కమలాపూర్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఐదు వాహనాల్లో తరలిస్తున్న రూ.8.21లక్షల నగదును పట్టుకున్నట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు. అనంతరం నగదుకు సంబంధించిన పత్రాలను పరిశీలించి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

# రూ. 2.31కోట్ల కుంభకోణంపై విచారణ వేగవంతం

- బల్దియా ఆడిట్, అకౌంట్ సెక్షన్ల నుంచి ఫైళ్లు స్వాధీనం
- మరోసారి అన్వేష్‌ను కస్టడీకి తీసుకోనున్న పోలీసులు



బల్దియా అకౌంట్స్ సెక్షన్‌లో ఉద్యోగులను విచారిస్తున్న మట్టెవాడ పోలీసులు

వరంగల్, అక్టోబర్ 18 : ఫోర్జరీ సంతకాలు, బోగస్ ఫైళ్ల కుంభకోణం కేసు విచారణలో పోలీసులు వేగం పెంచారు. నాలుగు రోజుల క్రితం సూత్రధారి అన్వేష్‌ను విచారించి కీలక సమాచారాన్ని రాబట్టారు. రూ. 2.31 కోట్ల కుంభకోణానికి సంబంధించిన బోగస్ ఫైళ్లను అకౌంట్స్ సెక్షన్ నుంచి అన్వేష్ తీసుకెళ్లాడు. కాగా, ఫైళ్లను అన్వేష్‌కు ఎలా ఇచ్చారని పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. అప్పటి అకౌంటెంట్ ఉమాకాంత్‌నూ విచారించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని అకౌంట్స్, ఆడిట్ సెక్షన్లకు వెళ్లి పోలీసులు కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### బోగస్ ఫైళ్లు ఉన్నట్లా? లేనట్లా?

బోగస్ ఫైళ్లు ఉన్నట్లా? లేనట్లా అనేది అంతుచిక్కడం లేదు. ఈ ఫైళ్లను అన్వేష్ తీసుకెళ్లినట్లు అకౌంట్ సెక్షన్‌లోని ఫైల్ మూవ్‌మెంట్ రిజిస్టర్లు స్పష్టం చేస్తున్నాయి. జీ2 సెక్షన్‌లో సృష్టించిన బోగస్ ఫైళ్లు ప్రస్తుతం కనిపించడం లేదు. పోలీసులకు అసలు ఫైళ్లు ఇంత వరకు లభించలేదు. కాగా, అన్వేష్‌ను విచారణ కోసం మళ్లీ కస్టడీకి అప్పగించాలని మట్టెవాడ పోలీసులు కోర్టును కోరినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఆడిట్, అకౌంట్ సెక్షన్ల ఉద్యోగులు వణికిపోతున్నారు. కేసు ఎటు తిరిగి ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు.

## ‘ఖేలో ఇండియా-ఫిట్ ఇండియా’ క్విజ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 18 : పాఠశాలల విద్యార్థులకు ఫిట్ ఇండియా క్విజ్ ద్వారా రూ.3 కోట్ల కంటే విలువైన నగదు బహుమతులు గెల్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ తెలిపారు. జేఈఈ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఫిట్ ఇండియా క్విజ్ రిజిస్ట్రేషన్, ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తామని, ప్రిలిమినరీ పరీక్ష ఆంగ్లం, హిందీతో పాటు 11 ప్రధాన స్థానిక భాషల్లో ఉంటుందన్నారు. ఫిట్ ఇండియా క్విజ్–2023 ప్రిలిమినరీ రౌండ్ కోసం ఈ నెల 31న రిజిస్ట్రేషన్ ముగుస్తుందని, ప్రతి పాఠశాల నుంచి కనీసం ఇద్దరు విద్యార్థులను నామినేట్ చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం https://fitindia.nta.ac.in/i/register ను సంప్రదించాలన్నారు.

## ఐస్ స్కేటింగ్ ప్రపంచ పోటీలకు సిద్ధార్థ్‌రెడ్డి



బచ్చన్నపేట, అక్టోబర్ 18 : మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు సిద్ధార్థ్‌రెడ్డి ఐస్ స్కేటింగ్ ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. 2024 జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు ఫిన్లాండ్‌లో జరిగే పోటీలకు భారత జట్టుకు ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ సదస్సుకు మల్లారెడ్డి



మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 18 : కేయూ గణిత శాస్త్ర ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి ఇండోర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ‘అప్లైడ్ మ్యాథమెటిక్స్ అండ్ మెకానిక్స్’ అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో సదస్సు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 18 : కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో–ఎడ్యుకేషన్)లో ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలు సంయుక్తంగా ‘మ్యాట్ ల్యాబ్ అండ్ 3డీ ప్రింటింగ్ అప్లికేషన్స్ ఇన్ ఇంజినీరింగ్’ అనే అంశంపై ఈ నెల 27, 28, 29వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ తెలిపారు. బుధవారం కేయూలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావుతో కలిసి ప్రిన్సిపాల్ మల్లారెడ్డి విడుదల చేశారు. చివరి సంవత్సరం చదువుతున్న ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరు కావొచ్చని తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సదానందం, కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల(కో–ఎడ్యుకేషన్) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మహేందర్, డాక్టర్ అసిం ఇక్బాల్, సీహెచ్ రాధికతో పాటు ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

## రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలకు ఆహ్వానం

సుబేదారి, అక్టోబర్ 18 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి 31వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని సీపీ పేర్కొన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, పోలీసుల కీర్తి ప్రతిష్టను పెంపొందించే అంశాలపై 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ చివరి వరకు తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి ఉన్న షార్ట్‌ఫిలిం పంపించాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారు పెన్ డ్రైవ్, 10–8 సైజ్ ఫొటోలను సీపీ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



రాహుల్(ఫైల్)

మల్హార్, అక్టోబర్ 18 : మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన పిట్టల రాహుల్(22) విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం రాహుల్ పత్తి చేను దగ్గరికి వెళ్లి వస్తా అని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో మంగళవారం కొయ్యూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్తున్న కూలీలకు దుర్వాసన రావడంతో అటుగా వెళ్లి చూడగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి పోలీసులు వెళ్లి పరిశీలించి రాహుల్‌గా గుర్తించి బంధువులకు సమాచారమిచ్చారు. రాహుల్ విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన ఓ రైతు అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడం కోసం విద్యుత్ వైర్లను అమర్చాడని, వాటికి తగిలి రాహుల్ మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కాటారం–మంథని రహదారిపై ధర్నా నిర్వహించారు. కాగా, ఘటనా స్థలం వద్దకు కాటారం సీఐ రంజిత్‌రావు రావు, కొయ్యూర్ ఎస్సై నరేశ్ చేరుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.